క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మలు, మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ తెలిపారు. 11కేవీ దేశ్‌ముఖ్‌కాలనీ ఫీడర్ పరిధిలోని కాలనీలలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు... 11కేవీ సాయికాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు.. 11కేవీ జైన్‌మందిర్ ఫీడర్ పరిధిలోని కాలనీలలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు.. 11కేవీ సామనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు.. 11కేవీ చాణక్యపురి ఫీడర్ పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుతసరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

తుక్కుగూడ: శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ భక్తులకు కొంగు బంగారంలాగా మారింది. ఆషాఢ మాసం అమ్మవారికి ఇష్టమైన రోజు మంగళవారం కావడంతో భక్తులు ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేసి మొక్కులు, కానుకలు చెల్లించుకున్నారు. అనంతరం శ్రీలక్ష్మినరిసింహస్వామి ఆలయంలో సామూహిక శ్రీ సత్యానారాయణ వత్రాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, పాలక మండలి సభ్యులు, పూజారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

భావన కుటుంబాన్ని పరామర్శించిన మేయర్


చిన్నారి తల్లిని ఓదార్చుతున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చిన్నారి భావన కుటుంబాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత పరామర్శించారు. కుర్మల్‌గూడలో సోమవారం భావన(6) అనే చిన్నారి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న మేయర్ మంగళవారం కుర్మల్‌గూడలోని భావన తల్లి తండ్రులు మిర్యాల విజయలక్ష్మి, వేణుగోపాల్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా చిన్నారి తల్లిదండ్రులకు మేయర్ ఆర్థిక సహాయం అందజేశారు.

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

కందుకూరు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాధిక ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ రవీందర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బోనాల పేరుతో బలవంతపు వసూళ్లు


పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు

హస్తినాపురం: బోనాల ఉత్సవాల పేరుతో బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరిని వనస్థలిపురం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ దేప జలేందర్‌రెడ్డి కథనం ప్రకారం... యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌కు చెందిన టి.వెంకటేశ్ (25), హరి(24) కలిసి పోలీస్‌స్టేషన్ పరిధిలోని జడ్జెస్ కాలనీలో పోచమ్మ ఆలయంలో బోనాల సందర్భంగా అమ్మవారి వివాహం జరిపించి అన్నదానం చేయడానికి ప్రతి ఇంటికీ వెయ్యి రూపాయలు ఇవ్వాలని బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారని కాలనీవాసి టి.శ్రీనివాస్ మంగళవారం వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ జరిపిన పోలీసులు ఇద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కత్తిరింపులతోనే అధిక దిగుబడి


మామిడి చెట్టు కొమ్మలు కత్తిరిస్తున్న కూలీలు

ఉద్యాన నిపుణుడు శ్రీకృష్ణ

కందుకూరు: పండ్లలో రారాజు మామిడి పండు. నాణ్యమైన పండ్లకు దేశ విదేశాల్లోనూ డిమాండ్ ఎక్కువే. మామిడితో అధిక దిగుబడి, నాణ్యమైన పంట ఉత్పత్తి కోసం సరైన యాజమాన్య పద్ధతులు రైతులు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. మామిడి సాగులో ప్రతి ఏడాది అధిక దిగుబడులు పొందాలన్నా, చీడపీడలు తగ్గాలి. వెలుతురు అన్ని కొమ్మలకు సోకి మంచి లాభాలు పొందాలంటే కత్తిరింపులు చాలా ముఖ్యమని సీనియర్ ఉద్యాన నిపుణుడు జి. శ్రీకృష్ణ సూచించారు. చెట్టు మీద ఎక్కువ ఆకులు ఉండేలా చూడాలి. చెట్టు ఆకులు చీడ పీడల బారిన పడినప్పుడు కొమ్మలు, రెమ్మలు, గుబురుగా పెరిగి కొన్ని ఆకులకు సూర్యరశ్మి సరిగ్గా చేరకపోవడంతో ఆహారపదార్థాలు తయారు చేసుకోలేవు. ఫలితంగా అధిక దిగుబడిని పొందలేమని ఆయన చెబుతున్నారు.

కత్తిరింపులకు సమయం

సాధారణంగా పంట కోసిన తర్వాత సుమారుగా 20 రోజుల వరకు చెట్టును అలాగే వదిలేయాలి. ఆ ఏడాది రుతుపవనాల ఆలస్యంగా ప్రవేశించాయి. అందువల్ల తోటకు ఒక తడి నీరు అందించడం మంచిది. దీంతో చెట్లు త్వరగా కోలుకుంటాయి. వర్షాలు సకాలంలో కురిస్తే నీటి తడి అవసరం లేదు. ఆ తర్వాత కత్తిరింపులు చేపట్టాలి.

కత్తిరించాల్సిన కొమ్మలు

సాధారణంగా చెట్టులో సూర్యరశ్మి సోకే చివరి కొమ్మలకే కాపు వస్తుంది. చెట్టుకున్న అన్ని కొమ్మలకు గాలి, సూర్యరశ్మి సోకేలా కత్తిరింపులు చేపట్టాలి. ముఖ్యంగా క్రితం ఏడాది కాయలు కాసి తొడమలు ఉన్న కొమ్మలు, చిక్కు మండలుగా, అడ్డదిడ్డంగా పెరిగిన కొమ్మలు, చీడ పీడలు ఆశించిన కొమ్మలు, నేలకు తాకుతూ వేలాడుతున్న కొమ్మలను కత్తిరించాలి. అలాగే గుబురుగా ఉన్న కొమ్మల్లో కొన్నింటిని, చెట్టు మధ్యలో నిటారుగా పైకి పెరిగే కొమ్మను, కాండం లేదా మొదలుపై వచ్చే పిల్ల కొమ్మలను పదునైన కత్తెరతో కత్తరించాలి.

వేయాల్సిన ఎరువులు

పది సంవత్సరాల పైబడిన తోటల్లో ఒక్కో చెట్టుకు 100 కిలోల బాగా కుళ్లిన పశువుల ఎరువు, 1000 గ్రాముల నత్రజని లేదా 2 కిలోల యూరియా, 1700 గ్రాముల భాస్వరం లేదా 7 కిలోల సూపర్ ఫాస్పేట్, 1120 గ్రాముల పొటాష్ లేదా 1.9 కిలోల ఎంఓపీ లను జులై, ఆగస్టు మాసంలో ఒకసారి, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో మరొకసారి వేసుకోవాలి. మామిడిలో సూక్ష్మపోషకాల లోపం ఎక్కువగా ఉంటే జింక్ సల్ఫేట్ 100–250 గ్రాములు, బోరాక్స్ 50–100 గ్రాములు, చెట్టు వయస్సును బట్టి మిగిలిన ఎరువులతో కలిపి చెట్టు పాదులో వేసుకోవాలి. ఇవేకాకుండా సూక్ష్మపోషకాల మిశ్రమం అందుబాటులో ఉన్నాయి. లీటరు నీటికి సూక్ష్మపోషకాల మిశ్రమాన్ని 3–5 గ్రాములు కలుపుకుని చెట్టుకు పిచికారి చేసుకుంటే మంచి ఫలితం ఉంటుందని ఉద్యాన నిపుణుడు జి.శ్రీకృష్ణ తెలిపారు.

దశల వారీగా మౌలిక వసతుల కల్పన


ప్రగతినగర్‌లో రోడ్డు పనులను ప్రారంభించిన మేయర్

మేయర్ దుర్గ

మీర్‌పేట: కాలనీల్లో దశల వారిగా మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని మీర్‌పేట కార్పొరేషన్ మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్ తెలిపారు. మంగళవారం 38వ డివిజన్ ప్రగతికాలనీలో రూ.5 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి సబితారెడ్డి సహకారంతో కార్పొరేషన్‌ను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. అనంతరం 5వ డివిజన్ రాఘవేంద్రనగర్ కాలనీ, 15వ డివిజన్ డివిజన్ లక్ష్మీనరసింహ కాలనీల్లో హెచ్‌ఎండీఏ నిధులతో చేపడుతున్న సీసీరోడ్ల నిర్మాణం పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు పద్మ, సిద్దాల పద్మ, గజ్జెల రాంచందర్, కమిషనర్ సిహెచ్.నాగేశ్వర్, డీఈ గోపినాథ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రానివి ప్రజావ్యతిరేక విధానాలు: సీపీఎం


సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

కందుకూరు: కేంద్రప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ దుయ్యబట్టారు. మంగళవారం మండల కేంద్రంలో సీపీఎం జిల్లా ముఖ్యకార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ప్రయోజనం పొందేందుకు ఉమ్మడి పౌరస్మృతి అమలు చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఆగస్టు 8న జిల్లా పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సెమినార్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్, సభ్యులు పి.యాదయ్య, బి.సామేల్, ఎన్.రాజు, సి.శోభన్, డి.జగదీష్, డి.రాంచందర్, మండల కార్యదర్శి శ్రీనివాస్, మహేశ్వరం కార్యదర్శి రవికుమార్, సభ్యులు కుమార్, చందు, శ్యాంసుందర్, జగన్, అంజయ్య, నరసింహా, జంగయ్య, కిషన్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత


చెక్కులు అందజేస్తున్న జంగారెడ్డి

కందుకూరు: సీఎం రిలీఫ్ ఫండ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి తెలిపారు. సీఎంఆర్‌ఎఫ్ నుంచి మండలంలోని సాయిరెడ్డిగూడకు చెందిన మారుతీకి రూ.27500, గూడూరుకు చెందిన ఈశ్వరమ్మకు రూ.20000 మంజూరైయ్యాయి. మంజూరైన చెక్కులను మంగళవారం జంగారెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు దశరథ, రాములు, సాయిరెడ్డిగూడ సర్పంచ్ మహేశ్, యూత్ అధ్యక్షుడు విఘ్నేశ్వర్‌రెడ్డి, జంగయ్య పాల్గొన్నారు.

నేటి బంద్‌ను విజయవంతం చేయండి

మీర్‌పేట: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఈ నెల 12న నిర్వహిస్తున్న రాష్ట్రవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని ఆ సంఘం బాలాపూర్ మండల అధ్యక్షుడు దాసరి అరవింద్‌కుమార్ పిలుపునిచ్చారు. అధికారంలోకి వస్తే కేజీ టూ పీజీ విద్యను ఉచితంగా అమలు చేస్తామని హామీ ఇచ్చిన.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాట తప్పిందన్నారు. రాష్ట్రంలో సుమారు 3500 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయలేదన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజు దోపిడీని అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఉచిత విద్యుత్‌కు పేటెంట్ హక్కు కాంగ్రెస్‌దే..

బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి



బడంగ్‌పేట్: ఉచిత విద్యుత్ పేటెంట్ హక్కు కాంగ్రెస్ పార్టీదేనని మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ.. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విద్యుత్ కొనుగోళ్లల్లో జరిగిన అవినీతి గురించి మాట్లాడారే తప్పా ఉచిత విద్యుత్ గురించి మాట్లాడలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేసి ఆదుకుందని తెలిపారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే మొదటి సంతకం ఉచిత విద్యుత్ బిల్లుపై చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ఉచిత విద్యుత్‌కు కట్టుబడి ఉందన్నారు.

నేడు తలకొండపల్లిలో ఎమ్మెల్యే పర్యటన

తలకొండపల్లి: పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు బుధవారం మండలంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పర్యటించనున్నారని ఎంపీడీఓ శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతారంలో.. గ్రామ పంచాయతీ భవనం, సీసీ రోడ్లు, పల్లె దవాఖానాకు శంకుస్థాపన, దేవుని పడకల్‌లో.. వైకుంఠధామం, సీసీ రోడ్ల ప్రారంభోత్సవం, వెంకటాపూర్‌తండాలో.. వైకుంఠధామం, డంపింగ్‌యార్డు ప్రారంభోత్సవం, గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన, పెద్దూర్‌తండాలో వైకుంఠధామం, డంపింగ్ యార్డు.. తలకొండపల్లి నుంచి పెద్దూర్ తండా వరకు వేసిన బీటీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించనున్నారని ఎంపీడీఓ తెలిపారు. అధికారులు, సిబ్బంది తప్పక హాజరుకావాలని కోరారు.

జీపీ కార్మికుల వేతన పెంపులో విఫలం


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

కందుకూరు: తెలంగాణ ధనిక రాష్ట్రమని చెప్పుకునే సీఎం కేసీఆర్ జీపీ కార్మికులకు వేతనాలు పెంచడంలో విఫలమయ్యారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు రవికుమార్ విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ ఆధ్వర్యంలో జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారంతో ఆరో రోజుకు చేరింది. కందుకూరు ఎంపీడీఓ కార్యాలయం చౌరస్తా వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దేవేందర్, శేఖర్, కారోబార్లు బాల్‌రాజ్‌గౌడ్, యాదయ్య, నర్సింహా, మహేందర్, మధు, శంకర్ పాల్గొన్నారు.

కాల్‌సెంటర్‌పై దాడి.. ఫర్నీచర్ ధ్వంసం


ధ్వంసమైన ఫర్నీచర్

చైతన్యపురి: కాల్ సెంటర్‌పై దాడి చేసి ఫర్నీచర్ ధ్వంసం చేసిన ఘటన సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిందివ. పోలీసుల కథనం ప్రకారం.. దిల్‌సుఖ్‌నగర్ లింగాల కాంప్లెక్స్‌లో పన్నెండేళ్లుగా వివేక్‌కుమార్ పాండే అనే వ్యక్తి కంపెనీ ఫ్యూచర్ సర్వీసెస్ పేరుతో నిరుద్యోగులకు బీపీఓలలో ఉద్యోగాలు కల్పిస్తున్నాడు. ఇదే కంప్లెక్స్ మూడో అంతస్తులో ఉండే ఇన్ఫినిటీ సొల్యూషన్స్ ఇనిస్టిట్యూట్ నిర్వాహకుడు మంగళవారం మధ్యాహ్నం సుమారు 25 మందితో కలిసి వివేక్‌కుమార్ పాండే కార్యాలయంపై దాడి చేసి పర్నీచర్‌ను ధ్వంసం చేశాడు. తమను వారించిన మహిళా ఉద్యోగులను దుష్టలాడుతూ బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో వివేక్ కుమార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ఘనంగా బోనాల ఉత్సవం


అమ్మవారి సన్నిధిలో వైద్య సిబ్బంది

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైభవంగా ఆషాడ మాసం బోనాలు నిర్వహించారు. బంగారు మైసమ్మ ఆలయంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉద్యోగులు, ఆశా వర్కర్లు, జిల్లా స్థాయి ఉద్యోగసంఘాల నాయకులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యం నివేదించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డా.వేంకటేశ్వర్లు, బస్తీ దవాఖానాల ఇంచార్జి డా.వినోద్, ఆలయ ఫౌండర్ ట్రస్ట్ సభ్యులు, మెడికల్ ఆఫీసర్ డా.అర్చన, సీనియర్ స్టాఫ్ నర్సు సృజన, సంజయ్‌నాయక్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు శిబిరం ప్రారంభం


శిబిరంలో అనితారెడ్డి తదితరులు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్ ఫేజ్–2 కాలనీలో మంగళవారం ఓటరు నమోదు శిబిరాన్ని మాజీ కార్పొరేటర్ పారుపల్లి అనితా దయాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు హక్కును నమోదు చేయించుకోవాలని, ఇళ్లు మారిన వారు చిరునామా మార్చుకోవాలని సూచించారు. ఓటరు నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కొండల్ రెడ్డి, దర్శన్ ముదిరాజ్, రాఘవేంద్రగుప్తా, ఎండీ సలీం, భగత్‌సింగ్‌నగర్ ఫేజ్–2 అధ్యక్షులు లక్ష్మణ్, రాము, భాగ్యమ్మ పాల్గొన్నారు.

మా పంచాయతీని 'ఇర్విన్'లో కలపొద్దు


రాజీనామా లేఖను అందజేస్తున్న వార్డుసభ్యులు

పల్గుతండా వార్డుసభ్యుల రాజీనామా

ఆమనగల్లు: నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఇర్విన్ మండలంలో పల్గుతండా గ్రామ పంచాయతీని కలపడాన్ని నిరసిస్తూ ఆ పంచాయతీ వార్డుసభ్యులు రాజీనామా చేశారు. ఈ మేరకు మాడ్గుల మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పల్గుతండా వార్డు సభ్యులు మేరావత్ కవిత, బానావత్ సునీత, లాలు, జటావత్ లాలు తమ రాజీనామా పత్రాలు అందించారు. పల్గుతండాను మాడ్గుల మండలంలోనే ఉంచాలని వారు కోరారు. అలాగే నర్సంపల్లి, చెట్లగుట్టతండాలను మాడ్గుల మండలంలోనే కొనసాగించాలని ఆయా గ్రామల ప్రజలు మంగళవారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయరెడ్డికి వినతిపత్రం అందించారు. మాడ్గుల మండలంలోని సుద్దపల్లి గ్రామాన్ని మాడ్గుల మండలంలోనే కొనసాగించాలని మాజీ సర్పంచ్ జానకిరాములు యాదవ్, ఎంపీటీసీ గ్యార వెంకటయ్య, ఉపసర్పంచ్ కొప్పుల శేఖర్‌గౌడ్, నాయకులు రాములుయాదవ్, ఆంజనేయులు యాదవ్, హరికృష్ణ యాదవ్.. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి


కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుజాతనాయక్

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి తన శాయశక్తులా కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని వివేకానందనగర్‌కాలనీలో కాలనీవాసులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీలో అర్ధంతరంగా నిలిచిపోయిన రోడ్డు పనులను తక్షణమే ప్రారంభించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను కాలనీవాసులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని, అలా చేసినప్పుడే పనులు త్వరగా పూర్తి కావడమే కాకుండా పనులలో నాణ్యత మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు తగ్గించండి: బీజేపీ


కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు హరిప్రసాద్

ఆమనగల్లు: పెంచిన ఇంటి పన్నులను వెంటనే తగ్గించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆమనగల్లు పట్టణంలో బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్ సింగ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పన్నులు తగ్గించాలని మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టి.. మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు విజయ్‌కృష్ణ, లక్ష్మణ్, చెన్నకేశవులు, శ్రీశైలంయాదవ్, బీజేపీ నాయకులు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె


ఆమనగల్లు: ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు


హయత్‌నగర్: అంబేడ్కర్ విగ్రహం ఎదుట..

ఆమనగల్లు: మధ్యాహ్న భోజన కార్మికులకు సంబంధించి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కురుమయ్య డిమాండ్ చేశారు. ఆమనగల్లు ఎంఈఓ కార్యాలయం ఎదుట మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి వారు ధర్నా నిర్వహించారు. కార్మికుల డిమాండ్లను పరిష్కరించని పక్షంలో నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్మికులు.. పద్మ, పార్వతమ్మ, పెంటమ్మ, శంకరమ్మ, శాంతమ్మ, ఖాజాబీ, రజియాబేగం, సుగుణమ్మ, ఈశ్వరమ్మ, పార్వతమ్మ, అలివేలు, యాదమ్మ, ఎల్లమ్మ, ఆమీన తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడికి తరలిరండి..

ఇబ్రహీంపట్నం: రెండు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి స్వప్న, సీఐటీయూ నాయకులు పోచమోని కృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల చె పట్టిన సమ్మె మంగళవారం కొనసాగింది. ఈ మేర కు ఇబ్రహీంపట్నంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట వారు ఆందోళన చేపట్టారు. బుధవారం చేప ట్టే కలెక్టరేట్ ముట్టడికి కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆ సంఘం నాయకులు సరిత, ప్రే మలత, పుష్పమ్మ, శిరీష, సుగుణమ్మ, కల్పనా, జంగమ్మ, అలివేలు, పద్మమ్మ, రంగమ్మలు పాల్గొన్నారు.

ఆందోళనలు ఉధృతం చేస్తాం..

హయత్‌నగర్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా నాయకుడు నర్సింహ హెచ్చరించారు. హయత్‌నగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ నేతలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. కార్మికులు లక్ష్మమ్మ, రమాదేవి, భాగ్యమ్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.